


## వయసుపొద్దు వాలే వేళ.. ఒంటరి పోరాటం

*(గత సంచిక నుంచి తరువాయి)*

### 9

సోమవారం ఉదయమే ఆఫీస్ కి వెళ్ళగానే ప్రభాకర్ పిలుస్తున్నాడని చెప్పడం కాస్త ఆశ్చర్యమనిపించింది. అసలు ఇంత తొందరగా ఆఫీస్‌కి వచ్చాడంటేనే వింతగావుంది.

సాధారణంగా పదకొండుదాటితేగాని రాడు ఒకసారి భోజనం చేసి ఏ రాత్రికి ఇల్లు చేరినా ఇబ్బంది లేదని అతని అభిప్రాయం.

వసంత అతని రూంలోకి అడుగు పెట్టేసరికి అప్పటికే మిగతా ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్  కూడా వున్నారక్కడ.

"రండి మీకోసమే చూస్తున్నాం "

కాస్తరిలీఫ్‌గా వూపిరి పీల్చుకుంది ఏదో అఫీషియల్ మీటింగ్ లెమ్మనుకుని సరిపెట్టుకుంది.

పత్రిక తీరుతెన్నులగురించి దాని సర్క్యులేషన్ పెంచాల్సిన అగత్యం గురించీ పెరిగిపోతున్న ఖర్చులగురించీ సవివరంగా గంటన్నరపాటు చర్చ జరిగింది. అందరికీ టీలు స్నాక్స్ ఇచ్చారు..

ఒక్కొక్కరు సెలవుతీసుకునే సమయంలో వసంత కూడా బయటకు రాబోయింది.

"వసంత గారూ మీరొక్కసారి ఆగండి మీతో మాట్లాడాలి" అన్నాడు. దాని భావం తెలిసిన మిగతా సిబ్బంది త్వరత్వరగా వెళ్ళిపోయారు.

అందరూ వెళ్ళిన రెండు నిమిషాలకు హఠాత్తుగా "ఇదేమైనా బాగుందా వసంతా?" కాస్త నిష్ఠూరంగా వుందతని స్వరం.

"ఏది? ఏం జరిగింది?" కంగారు పడింది.

"ఇక్కడ పనిచేస్తూ ..నువ్వు వ్రాస్తావని నాకు చెప్పకపోవడం?"

"ఓహ్ అదా ...ఏవో మామూలు వ్రాతలేగా ..."

"అదిసరే ఒక్కమాట చెప్పివుంటే మన పత్రికలోనే పెద్ద పబ్లిసిటీ ఇచ్చి మరీ నవల వేసే వాళ్ళం కదా..."

అతనికి సంగతి ఎలా తెలిసిందా అని ఆలోచిస్తూనేవుంది.

"వెయ్యరని కాదు ...నా రచన మన పత్రికకు తగ్గదో కాదో..."

"అయినా ... ఇది చూడు .... " సప్తరాగిణి వారి పత్రిక మొదటిపేజీలో పూర్తి పేజీ కొత్త సీరియల్ అడ్వర్టైజ్‌మెంట్

ఓ పక్కన ఆమె ఫోటో

రంగురంగుల అక్షరాలతో నిజంగానే అద్భుతంగావుంది.

కొత్త పత్రిక ఆ రోజే వచ్చింది...

"అరె! నాకు తెలీనే తెలీదింకా " ఆశ్చర్యంగా పత్రిక తీసుకుని మురిపెంగా చదువుకుంది.

"సీరియల్ వేసుకుంటారా అని అడగ్గానే వేసుకుంటామన్నారు కాని ఇంత తొందరగా ప్రకటిస్తారని అనుకోలేదు .."

"ఎన్ని వేలిస్తామన్నారు సీరియల్‌కి ?"

"పాతిక" కావాలని కాస్త ఎక్కువే చెప్పింది.

"ఓ పని చెయ్యి , నేను ముప్పై వేలిస్తాను , ఇప్పుడే సీరియల్ వాళ్ళకు ఇవ్వడంలేదని చెప్పు. మన పత్రికలోనే వేసుకుందాం" ప్రభాకర్‌కి అది ప్రెస్టేజ్ ఇష్యూగా తోచింది.

గొంతులో పెనుభూతం అడ్డుపడ్డట్టయింది వసంతకు -నిమిషంలో ఏదో ఒకటి చెప్పాలి -ఈ ప్రభాకర్ దేవాంతకుడు... అంతేనా లాభనష్టాల బేరీజు ఈపాటికే వేసుకుని వుంటాడు.

అతనికిచ్చినా బాగుందనీ బాగాలేదనీ ఎన్నయినా అనగలడు.

ఏంచెయ్యాలి?

"అదెలా కుదురుతుంది ప్రభాకర్? ముందు అగ్రిమెంట్ వ్రాసుకున్నాకే వాళ్ళు డబ్బిచ్చి మరీ పట్టుకెళ్ళారు నవలను" కావాలనే కాస్త అబద్ధాన్ని జోడించింది.

"ఇక్కడ పనిచేస్తూ వేరెవరికో నవల ఇవ్వటం బాగుందా? " కాస్త తీక్షణంగానే వుందతని స్వరం.

వసంతకూ కోపం తన్నుకు వచ్చింది

"ఉద్యోగవిషయంలో మనం ఎలాంటి కండిషన్స్ వ్రాసుకోలేదనుకుంటాను" కాస్త నిక్కచ్చిగానే జవాబిచ్చింది.

"అది కాదు వసంతా"

కాస్త మెత్తబడ్డాడు.

"సరేలే ఇకపైన ఇలా చెయ్యకు "

ఇహ మాట్లాడటం అయిపోయిందన్నట్టుగా ఏదో ఫైల్ ఓపెన్ చేసాడు.

ఒక్క క్షణం అక్కడే నిల్చుంది వసంత.

ఇకపైన సంగతి కూడా వేడిలో వేడి అప్పుడే తేల్చుకుంటే పోతుందన్నట్టు.

మళ్ళీ మనసు మార్చుకుని బయటకు నడిచింది.

సీట్‌లో వెళ్ళి కూర్చున్నా మనసంతా వికలమైపోయింది.

ఇంతవరకూ ఎవరూ ఇప్పుడూ ఇలా ఎందుకు చేసావని ఆమెను అడగలేదు. అలాంటిది...

ఎక్కడ లేని ఉక్రోషం ఆమెను నిలవనియ్యడంలేదు.

వెంటనే సెలవుపెట్టి ఇంటికి వెళ్ళిపోదామనిపించినా తమాయించుకుంది.

ఏది చదివినా మనసుకు పట్టడం లేదు.

పని చేసేందుకు ఇష్టంగా లేదు.

ఉద్యోగం చేసినంతమాత్రాన తన రచనలు తన ఇష్టం వచ్చిన వాళ్ళకు ఇవ్వకూడదా? ఇదెక్కడి నియమం?

అలాంటి నిబంధనలకు తలవంచే మనిషి కాదు తను. ఏం చేస్తాడో చేసుకోనీ మరో నవల ఈరోజే ఆరంభిస్తాను..

ఈ పత్రికకు తప్ప మిగతా అన్నింటికీ ఇస్తాను ..మహా అంటే ఉద్యోగం మరొకరికి ఇచ్చుకుంటాడేమో ... ఇచ్చుకోనీ...

ఇక్కడ భయంతో గుండెలాగిపోయే వాళ్ళెవరూ లేరు...

ఓ పక్క ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి మరో పక్క మనసు పొరల్లో కొత్త నవలకు ఆవిష్కరణ ఆరంభమైంది.

మనిషికీ మనిషికీ మధ్య మాటల లోకం ఒకటైతే నిశ్శబ్దలోకం మరొకటీ -ప్రతిమనిషికీ రెండు లోకాలు

అవును రెండు లోకాలు

సంస్కారం ముసుగులో ఒక లోకం.. నగ్నంగా మరొకలోకం..

నవలకు చక్కని పేరు

రెండు లోకాలు...

కొత్త నవలకు ఆ పేరుతో శ్రీకారం చుట్టడం జరిగింది.

ఒక కుటుంబం.. అందులోని ప్రతివ్యక్తి .. రెండులోకాలూ చాలు నవలకు..

నెమ్మది నెమ్మదిగా నవల రూపకల్పనలో మునిగిపోయిన ఆమె మనసు చిత్రంగా శాంతించింది.

తన యాభై ఏళ్ళ జీవితంలో అనుభవంలోకొచ్చిన ఏపాత్రలు నవలకు చక్కగా అద్దినట్టు సరిపోతాయో కూడా ఏరి  పెట్టుకుంది.

గడియారం ఐదు గంటలు కొట్టగానే లేచి ఆఫీస్ బయటకు వచ్చెయ్యడం ఆమెకే కొత్తగావుంది.

ఇంటికి వస్తూనే టీవీ ఆన్ చేసే అలవాటు మరచిపోయింది.

వంటింటిలోకి వెళ్ళి టీ కూడా చేసుకోవాలనిపించలేదు.

డైనింగ్ టేబుల్ మీద రైటింగ్ పాడ్ పేపర్లు సిద్దంగా ఉన్నాయి.

శ్రీ గుర్తుకు వచ్చాడు ఇదివరకులా మనసు విషాదంలో కొట్టుకుపోలేదు.

అతనే తనకో చక్కని స్ఫూర్తిలా అనిపించింది.

నవలకంటే ముందు  భావానికి రూపకల్పన ఇవ్వాలనిపించింది.

నాకు తెలుసు

నాచుట్టు పక్కలే తారట్లాడుతుంటావు

కంటికి కనిపించకపోయినా

స్పర్శ నిశ్శబ్దంగా  పలకరిస్తూనేఉంటుంది

నడివేసవి నిట్టూర్పుల్లో

మలయ మారుతంలా

మంచిగంధంలా

నా అధరాగ్రాలను అలవోకగా స్పృశించిపోయేది

నీ చిలిపితనం కాక మరేమిటి

ఊపిరాడని ఉద్విగ్నతలో

గాలి ఉరేసుకుని తలవాల్చేసిన నిర్జీవ క్షణాన

నీ చేతి పలకరింపు నా చెక్కిళ్ళపై

వెన్నెలె చల్లదనంతో
వినూత్న కావ్యాల నావిష్కరించటం
నాకు తెలీదా?
హఠాత్తుగా జనసంద్రం నడిమధ్యన
నీటి బొట్టులా నేను
నిశ్చలంగా పయనించేవేళ
అగుపించని నీ బాహువుల మధ్య
అనునయ కౌగిట్లో నేను ఓ పులకింతగా

అందరి మధ్యనా నిర్లజ్జగా
నీలో ఓఅణువై చెమ్మగిలిన మనసై
ద్రవించి ద్రవించి ఓ ప్రవాహాన్నవుతాను
ప్రణయగీతాన్నవుతాను
ప్రేమ వల్లరినౌతాను
నాకు తెలుసు
మనిద్దరి ఊసులకూ బాసలకూ
దేహాల ప్రసక్తిలేదు
అలలు అలలుగా సాగే నీ ప్రేమ గానంలో
నేను తుంపర్లు తుంపర్లుగా
జల్లులు జల్లులుగా కురుస్తాను
రారమ్మని పిలిచే వలపు బాహువుల్లో
ఓ చిరుగువ్వనై ఒదిగిపోతాను
నిన్ను చూడలేని లోకం నాకో
రుగ్మత నాపాదిస్తుంది
అయితేనేం గాక
అనుక్షణం నీకోసమే నేనో
సజీవ చైతన్యాన్నవుతాను
సజీవ చైతన్యాన్నవుతాను..

చిత్రంగా వ్రాసుకున్నదాన్ని పదే పదే చదువుకుని ఓ రకమైన ఓదార్పును పొందగలిగింది వసంత.

ఆత్మ సంతృప్తి --ఒక దిశానిర్దేశం ఆమె మనసుకు గోచరించాయి.

ఏళ్ళ తరువాత మొదటిసారి ఆకలి అనిపించిందామెకు

లేచి వెళ్ళి వంటింట్లో ఉన్నవాటితో ఉన్నంతలో వంట చేసుకుంది.

అన్నం, చారు, కంది పచ్చడి ... ఎన్ని రోజులకు

డైనింగ్ టేబుల్ దుమ్ముకొట్టుకుని వుంది. ముందు దాన్ని సర్ఫ్ నీళ్ళతో పైన కోలిన్‌తో శుభ్రంగా తుడిచి టేబుల్ మాట్స్ తెచ్చి వేసుకుంది.

అలవాటుగా రెండు ప్లేట్స్ తెచ్చి పెట్టి, నవ్వుకుని ఎదురుగా అతను వున్నట్టుగానే ఫీలయి ఎలా మర్చిపోతాను చూసారుగా యూ ఆర్ విత్ మీ

మొదటి ముద్ద ఖాళీ ప్లేట్‌లో వుంచి తినడం ప్రారంభించింది.

తింటున్నంత సేపూ కూడా నవల ప్లాన్ ఆలోచిస్తూనేవుంది

టీవీ నైన్ లో వార్తలు చూసి , అప్పుడు ప్రారంభించింది "రెండు లోకాలు" రచన.

నెల రోజులు తిరగలేదు.

ఓపక్క సప్త రాగిణిలో సీరియల్ మంచి వేగం పుంజుకుని ప్రతివారినీ ఆకర్షిస్తూనేవుంది.

మరో మాసపత్రికలో రెండు లోకాలకు మొదటి బహుమతి..!

ఒక్క క్షణం ఉక్కిరిబిక్కిరైంది వసంత.

ఎదురు చూడని విజయం. పదిరోజుల ముందుగానే ఉత్తరం వచ్చినా పత్రికా ముఖంగా వస్తే తప్ప ప్రభాకర్‌కి చెప్పదలుచుకోలేదు.

అయితే మిత్రురాళ్ళకు మాత్రం ఓ సాయంత్రం సరదాగా పిలిచి బ్లూ మూన్‌లో పార్టీ ఇచ్చింది.

నిజంగా వసంతలో మార్పుకు సంతోషించింది వాళ్ళే

ఎంత మామూలుగా కనిపిస్తున్నా ఆమె మొహంలో విషాదం వాళ్ళకు కనిపిస్తూనేవుండేది.

అలాంటిది ఇప్పుడు కాస్తా తేరుకున్నట్టు ఉత్సాహంగా వుండటం సంతోషకరమైన మార్పే.

నిజమే ఇదివరలో ప్రతి రోజూ నిద్రంతా అతని కలలతోనే గడచిపోయేది.

ఎంతో దిగులు పడుతున్నట్టూ, విపరీతమైన బాధలో వున్నట్టు కలల్లో కనిపించేవాడు శ్రీ

అలాంటిది ఇప్పుడు ఎంతో ఉత్సాహంగా ... ఎప్పటి చిరునవ్వుతో ...

అంటే నా సంతోషమే అతని సంతోషమా ? ఏదో పరిశోధించి కనుగొన్నట్టు ఫీలయింది వసంత.

అవును .

నేను సంతృప్తి గా వుండటమే అతనికి ఆనందం

నేను ఇదివరలోలా ఎప్పటిలావుండాలి ...

ఆలోచన వచ్చిందే తడవుగా అమలుకు తలపడింది.

మాసిపోయి పాతబడిపోయిన కర్టెన్లు మార్చుకుంది...

వాడి ఎండిపోయిన పూల మొక్కలు మార్చి కొత్త కుండీలు తెచ్చుకుంది..

చీరలు సైతం ఒక్కటీ బాగున్నట్టుతోచడం లేదు

ఎప్పుడూ లేనిది బీరువా తెరిచి పదినిమిషాలు వెతుక్కుంటే గాని ఏం కట్టుకు వెళ్ళాలో తెలియడం లేదు.

అందుకని సేవింగ్స్‌లో ఎంత డబ్బుందో ఒకసారి చూసుకు మరీ పెద్ద ఖరీదులో కాకుండా రెండు చీరలు ఓ మోస్తరు ధరల్లో కొత్త డిజైనర్‌వేర్ లో తెచ్చుకుంది.

నగలంటే ఎప్పుడు పెద్ద మోజులేదు.

ఇల్లు పరిసరాలు ముఖ్యంగా బెడ్ షీట్స్ లాటివన్నీ మార్చుకుంది.

పుస్తకానికంటే ముందు డబ్బు పంపించివేసాడు మాసపత్రిక ఎడిటర్.

ఈ విషయం ఇవ్వాళో రేపో ఎలాగూ ప్రభాకర్‌కి తెలుస్తుంది.

అంతవరకూ ఆగేకంటే ముందుగా తనే చెప్పెయ్యడం మంచిదనిపించింది.

అంతకుముందురోజే కొత్తచీరలన్నీ ఫాల్ కుట్టించుకుని తెచ్చుకుంది. దాంట్లో బాగా నప్పుతుందనిపించిన మెరూన్ ప్రింటెడ్ క్రేప్ కట్టుకుని పుల్లారెడ్డిలో స్వీట్స్ కొనుక్కుని మరీ వెళ్ళింది ఆఫీసుకు.

వసంతలో కొత్త నేవళం మనిషిలో మార్పు ప్రభాకర్ గమనించకపోలేదు. అయితే ఎలా అడగాలో అతనికి తెలీటం లేదు.

ఇదివరకులా వ్యక్తిగత విషయాలు మాట్లాడే అవకాశం ఇవ్వటం లేదామె. ఆఫీస్ పని ఎంతవరకో అంతవరకే..

ఇహ ఇంటికి ఎవరూ వచ్చే ప్రసక్తే లేదు.

చెప్పి రావడానికి ఉండటం లేదంటుంది.

చెప్పకుండా ఒకటీ రెండు సార్లు ప్రభాకరే కాదు, చైతన్య కూడా వచ్చినా ఇంటికి తాళం ఎదురయ్యేది.

కొద్ది రోజులక్రితమే ఇంటికి డోర్ లాక్ పెట్టించుకుంది వసంత... దొంగతనాలు ఎక్కువయ్యాయనీ ఇలాగయితే ఇంట్లోనే ఉన్నాననుకుంటారనీ చెప్పింది అందరికీ..

కాని ఇంట్లో వున్నాలేరనుకోగల వాస్తవం లాభం ఆమెకొక్కదానికే తెలుసు.

ప్రభాకర్ వస్తూనే అతని గదికి వెళ్ళి ముందుగా అతనికి స్వీట్స్ ఇచ్చాక ఆఫీస్ బోయ్‌తో అందరికీ పంపించింది.

"ఏమిటి విశేషం ఈరోజు నీపుట్టిన రోజు కూడా కాదు..."

"పుట్టిన రోజున మాత్రమే హాపీగావుండాలా? ఇవ్వాళనా జీవితంలో ఓ విశిష్టమైన రోజు....నా నవలకు జ్యోతి నవలలపోటీలో మొదటిబహుమతి వచ్చింది "

అంతవరకు తియ్యగా తోచిన కాజూ బర్ఫీ ఒక్కసారి వెగటనిపించింది ప్రభాకర్‌కు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు చదవాలంటే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..!

